

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

# రేవంత్ పాలన అట్టర్ ఫ్లాప్

- కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌పై దాడి హేయమైన చర్య
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్, మే 27: రాష్ట్రంలో రేవంత్ పాలన అట్టర్ ఫ్లాప్ అయిందని, ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని, కాంగ్రెస్ పాలన బీహార్‌ను తలపిస్తున్నదని మండిపడ్డారు. సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడిచేయడం హేయమైన చర్య అని ఆగ్రహించారు. మానకొండూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేల కార్యాలయాల్లో సీఎం ఫొటో పెట్టాలనే నిబంధన ఉంటే బీజేపీ, ఎంఐఎం ఎమ్మెల్యేల ఆఫీసుల్లో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఏమైనా దేశభక్తుడా, తెలంగాణ ఉద్యమకారుడా కాంగ్రెస్ నాయకులు చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు కేసులో పట్టుబడిన దొంగ అని, నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ చార్జిషీట్‌లో ఆయన పేరు చేర్చిందని దుయ్యబట్టారు. కేటీఆర్ క్యాంప్ ఆఫీస్ జరిగిన దాడిపై మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎందుకంటే బీజేపీ, కాంగ్రెస్ రెండు ఒక్కటేనని, ప్రజలు గమనించాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ శ్రేణులు తిరగబడితే కాంగ్రెస్ నేతలు ఇండ్లల్లో నుంచి అడుగు బయటపట్టే పరిస్థితి ఉండదని తేల్చిచెప్పారు. దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేయకుండా, అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ పోలీసులకు దేశవ్యాప్తంగా మంచి పేరుందని, పోలీస్ సిబ్బంది పార్టీలకతీతంగా న్యాయంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ మానకొండూర్ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్వీ నియోజక కన్వీనర్ గుర్రం కిరణ్‌గౌడ్, నాయకులు శాతరాజు యాదగిరి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, రామంచ గోపాల్‌రెడ్డి, రాజుయాదవ్, బోడ రాజశేఖర్, కొట్టె రఘు, నెల్లి శంకర్, పిండి సందీప్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ అభ్యర్థికి సర్వే కిట్టు అందజేస్తున్న కలెక్టర్, ల్యాండ్ సర్వే ఏడీ

# భూకొలతల్లో సర్వేయర్ల పాత్ర కీలకం

- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, మే 27: భూముల కొలతలు, సర్వే చేయడంలో సర్వేయర్ల పాత్ర ఎంతో ముఖ్యమని, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమాన్ని జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 269 మంది సర్వేయర్లకు 50 పనిదినాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దీనిని సర్వేయర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూములకు సంబంధించి సర్వేయర్లు పలు రకాల సర్వేలు నిర్వహించాల్సి ఉంటుందని, ప్రభుత్వ, అసైన్డ్ భూముల, ప్రాజెక్టుల భూసేకరణ, ఎఫ్‌లైన్ సర్వే చేయాల్సి వస్తుందన్నారు. రెవెన్యూకు సంబంధించి గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో, సరిహద్దుల వివాదాలు పరిష్కారంలో సర్వేయర్ల పాత్ర కీలకమన్నారు. శిక్షణకు క్రమం తప్పకుండా హాజరై, అన్ని అంశాలు కుణ్ణంగా వింటూ, పరిశీలిస్తూ అవగాహన చేసుకోవాలని ఉద్బోధించారు. రైతులు, ప్రజల అవసరాలకనుగుణంగా భవిష్యత్తులో శిక్షణ పొందిన వారికి సర్వే పనులు లభిస్తాయన్నారు. గత రికార్డులు పరిశీలిస్తూ క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి, సర్వే విధానం కూలంకషంగా అధ్యయనం చేయాలన్నారు. అంతకుముందు శిక్షణ సర్వేయర్లకు సర్వే సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.


# సిల్ట్ తొలగింపు పనుల్లో వేగం పెంచాలి

- కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కార్పొరేషన్, మే 27: నగరంలోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపు పనులను వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల ప్రధాన స్టాం వాటర్ డ్రైనేజీ సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వానాకాలం దృష్ట్యా కొద్ది రోజుల క్రితమే నగర వ్యాప్తంగా ప్రధాన స్టాం వాటర్ డ్రైనేజీలో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపునకు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులను ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుతం స్టాం వాటర్ డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని చెప్పారు. వర్షాలు ప్రారంభం కావడానికి ముందుగానే పనులు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. డ్రైనేజీలో అధికంగా సిల్ట్ పేరుకుపోయిన చోట.. ఎక్స్‌కవేటర్ యంత్రాలను వినియోగించుకోవాలని సూచించారు. డ్రైనేజీలో తీసిన సిల్ట్‌ను సుదూర ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

# ముగిసిన జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కొత్తపల్లి, మే 27 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాంతీయ క్రీడాపాఠశాలలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జరిగాయి. సబ్ జూనియర్, అండర్-8, 10, 12 సంవత్సరాల విభాగాల్లో బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా యువజన క్రీడాశాఖాధికారి వి. శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో అత్యంత ప్రతిభ చూపిన క్రీడాకారులను జూన్‌లో సికింద్రాబాద్‌లోని జింఖానా క్రీడా మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పంపించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి పేర్కొన్నారు. పోటీల నిర్వహణలో అసోసియేషన్‌కు చెందిన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేసిన డీవైఎస్‌వో

# మానవత్వం చాటుకున్న పూర్వ విద్యార్థులు

గంగాధర, మే 27: మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన అలిశెట్టి అనురాధ నెల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈమె భర్త సత్యనారాయణ అనారోగ్యంతో గతంలోనే మృతి చెందాడు. తల్లిదండ్రులు ఇద్దరు అకాల మరణం చెందడంతో వీరి కుమారులు విశాల్, రాహుల్ అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న గర్శకుర్తి పాఠశాలలో 2001-02లో అనురాధతో పాటు 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. పూర్వ విద్యార్థులంతా కలిసి రూ. 80 వేలు సేకరించి, విశాల్, రాహుల్ పేరిట రూ.40 వేల చొప్పున గర్శకుర్తి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మంగళవారం వారికి డిపాజిట్ పత్రాలను అందజేశారు. ఆపదలో ఉన్న తమ కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులకు అనురాధ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమ నిర్మాణాలకు అడ్డేది..?

- ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం
- ముడుపులు మత్తులో టౌన్ ప్లానింగ్
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

కార్పొరేషన్, మే 27: కరీంనగర్‌లోని సీతారాంపూర్‌కు చెందిన ఓ వ్యక్తి తమ ప్రాంతంలో నిబంధనలు పాటించకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కానీ చర్యలు శూన్యం. మళ్లీ ఇదే విషయంపై పది రోజుల తర్వాత సదరు వ్యక్తి మరోసారి నగర మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. అయినా ఎలాంటి ఫలితం లేకపోయింది. నగరంలో సాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం ముడుపులు మత్తులో తూగుతున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటిపై పలువురు మాజీ కార్పొరేటర్లు సైతం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా చర్యలు లేకపోవడంతో టౌన్ ప్లానింగ్‌లో సిబ్బంది ఇష్టారాజ్యం అన్నట్లు వ్యవహారం సాగుతున్నది.

## అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు

నగరంలో ఇటీవల కాలంలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాల సంఖ్య పెరుగుతున్నది. నగరంలోని భవన నిర్మాణాలపై దృష్టి సారించాల్సిన అధికారులు అమ్యామ్యాలతో సరిపెట్టుతుండడంతో నగరంలో అక్రమాలకు అడ్డు లేకుండా పోయిందన్న విమర్శలు వినవస్తున్నాయి. ముఖ్యంగా కొంత మంది లైసెన్స్‌డ్ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ వ్యవహారం నడిపిస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఇటీవల కాలంలో నిర్మాణాల సంఖ్య పెరుగుతున్నా, అనుమతులు తీసుకున్నవి అతి తక్కువగానే ఉంటాయని తెలుస్తున్నది. సప్తగిరికాలనీ, రాంనగర్, పద్మనగర్, సీతారాంపూర్, మార్కండేయనగర్‌తో పాటు విలీన గ్రామాల్లోనూ పెద్ద సంఖ్యలో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయని విమర్శలు వస్తున్నా చర్యలు తీసుకునే వారు లేకుండా పోయారు. స్థానికులు ఎవరైనా ఫిర్యాదులు చేసినా టౌన్ ప్లానింగ్ అధికారులకు వసూళ్లకు అవకాశం అన్నట్లుగా పరిస్థితి మారిందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



నగరంలో అనుమతులు లేకుండానే జరుగుతున్న భవన నిర్మాణం

## అనుమతులు ఉన్నా ముడుపులివ్వాల్సిందే

నగరంలో టౌన్ ప్లానింగ్ నుంచి అనుమతులు తీసుకొని భవన నిర్మాణాలు చేపట్టినప్పటికీ ఆ విభాగం అధికారులకు ముడుపులు ఇవ్వక తప్పడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపట్టినా నిబంధనల ప్రకారం నిర్మాణాలు సాగడం లేదన్న సాకుతో టౌన్ ప్లానింగ్‌కు చెందిన చైన్‌మెన్లను క్షేత్రస్థాయిలోకి పంపించి పనులు నిలిపివేసి వసూళ్లకు తెగబడుతున్నారని మాజీ కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా సంబంధిత అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు పేర్కొంటున్నారు. నగరంలో నిర్మాణాల విషయంలో దృష్టి పెట్టాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారుల ఇష్టారాజ్యం అన్నట్లుగా వ్యవహారం సాగుతున్నదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ విభాగంపై ఫిర్యాదులు వస్తున్నా పక్కదారి పట్టిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏదైనా ఫిర్యాదులపై సమాచారం కోసం వెళ్లినా సరైన సమాధానం చెప్పే వారు లేకుండా పోయారని, ఈ విషయంలో దృష్టి పెట్టాల్సిన నగరపాలక ఉన్నతాధికారులు సైతం ఈ విభాగం పనితీరుపై పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తున్నారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో ఇప్పటికైనా నగరపాలక ప్రత్యేకాధికారి దృష్టి సారించాలని నగరవాసులు కోరుకుంటున్నారు.

# ఆటో డ్రైవర్ల నిర్బంధం

- హైదరాబాద్‌లో సభకు వెళ్లకుండా పోలీసుల ఉక్కుపాదం
- ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు.. ఠాణాకు తరలింపు



నగరంలో పోలీసుల అదుపులో ఆటో కార్మిక సంఘం నాయకులు, డ్రైవర్లు

కార్పొరేషన్/ తెలంగాణచౌక్, మే 27: ప్రశ్నించే గొంతుకలను రాష్ట్ర సర్కారు నొక్కేస్తున్నది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న కార్మిక వర్గాలపై ఉక్కుపాదం మోపుతున్నది. మంగళవారం హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద చేపట్టిన 'ఆటో డ్రైవర్ల ఆకలి కేకల' సభకు వెళ్లకుండా ఆటో డ్రైవర్లను పోలీసులతో ముందస్తుగా అరెస్టు చేయించింది. ఎక్కడికక్కడ కట్టడి చేసి నిర్బంధించింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో మొదటి, రెండో ఠాణా పోలీసులు ఆటో కార్మిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల రాజేందర్, ప్రధాన కార్యదర్శి సంపత్, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, నాగభూషణం, వడ్లకొండ శ్రీనివాస్, వేణుమాధవ్, సాగర్, గొర్రె రవీందర్, మద్దుల రాంగోపాల్‌రెడ్డి, నరసింహనాయక్, మచ్చ శ్రీనివాస్, దండు అంజయ్య, సయ్యద్ ఖాజా, రమేశ్, అనిల్‌ను అదుపులోకి తీసుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లోనే నిర్బంధించారు. అలాగే శంకరపట్నం మండలంలో పలువురు ఆటో యూనియన్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని శాంతియుతంగా ఇందిరాపార్కు వద్ద చేపట్టిన సభకు వెళ్లకుండా వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. ప్రజాపాలన తీసుకొస్తామని ప్రగల్భాలు పలికి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నదని మండిపడ్డారు. ఉచిత ప్రయాణం పథకానికి తాము వ్యతిరేకం కాదని, తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. జిల్లా చెందిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు. సభలు, సమావేశాల్లో మాట్లాడితే సర్కారు దగ్గర డబ్బులు లేవని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు, మరి అందాల పోటీలకు రూ.200 కోట్లు ఎలా ఖర్చుపెడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

## ఆర్ఎంపీ హఠాన్మరణం

హుజూరాబాద్ రూరల్, మే 27: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ అల్లి శ్రీనివాస్(60) గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం అల్లి శ్రీనివాస్‌కు ఛాతిలో నొప్పి రావడంతో హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. కాగా, అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కొన్నేండ్లుగా గ్రామంలో రోగులకు వైద్య సేవలందిస్తున్న శ్రీనివాస్ మృతి గ్రామానికి తీరని లోటని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

## నూతన ఎన్నిక

సైదాపూర్, మే 27: మండల కేంద్రంలోని వెన్కేపల్లి తాపీ నిర్మాణ సంఘం అధ్యక్షుడిగా మేడవేణి వెంకటయ్య శనివారం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మేడవేణి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పేరాల రవి, కార్యదర్శిగా దొంత రాజయ్య, కోశాధికారిగా లంకసిరి ఐలయ్యతో పాటు కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, తిరుపతి, అనిల్, కిరణ్, రామకృష్ణ, ఆంజనేయులును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ పాల్గొన్నారు.

## అంతిమ సంస్కారాలకు ఇక్కట్లు

కరీంనగర్ రూరల్, మే 27: కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామ శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు లేక అంతిమ సంస్కారాల వేళ మృతుల బంధువులు ఇక్కట్ల పాలవుతున్నారు. నీటి సరఫరా చేసే పైపులైన్ చెడిపోయి ఐదు నెలలు గడుస్తున్నా కనీసం పట్టించుకునే నాథుడే లేకపోవడంతో అంత్యక్రియల తర్వాత కనీసం స్నానాలు చేయలేకపోతున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక విద్యుత్ దీపాలు వెలగడం లేదని, రాత్రి వేళల్లో అంతిమ సంస్కారాలు చేయాలంటే వాహనాల లైట్ల వెలుగే దిక్కవుతున్నదని చెబుతున్నారు. శ్మశానం ఆవరణ పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని, చెత్తాచెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతున్నదని వాపోతున్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలని గ్రామ మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



దుర్శేడ్ శ్మశాన వాటికలో పేరుకుపోయిన చెత్తాచెదారం

## మండలంలో భారీ వర్షం



కాసారంలో పిడుగు పడి మరణించిన బర్రె

గంగాధర, మే 27: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని కాసారం గ్రామానికి చెందిన పెద్ది తిరుపతి తన బర్రెను పొలం వద్ద కట్టివేయగా పిడుగుపడి మరణించింది. చనిపోయిన బర్రె విలువ రూ.70 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం తరపున రైతుకు పరిహారం అందజేసి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ వేముల దామోదర్ కోరారు.




చిగురుమామిడి: పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు



గంగాధర పోలీస్ స్టేషన్‌లో..

# బిల్లులు చెల్లించమంటే వేధింపులా?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ సర్పంచులు
- సీఎం ఇంటి ముట్టడికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు



చొప్పదండి: మండలంలోని మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు

హుజూరాబాద్ టౌన్/ జమ్మికుంట/ చిగురుమామిడి/ గంగాధర/ శంకరపట్నం/ గన్నేరువరం/ చొప్పదండి/వీణవంక/ సైదాపూర్/ తిమ్మాపూర్ రూరల్, మే 27: తమ బిల్లులు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తున్నదని మాజీ సర్పంచులు మండిపడ్డారు. మంగళవారం ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి మాజీ సర్పంచులు వెళ్తున్నారనే సమాచారంతో జిల్లాలో మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మాజీ సర్పంచులు.. ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు రోజుల క్రితం గ్రామపంచాయతీ బిల్లులు 153 కోట్లు, ఎస్డీఎఫ్ గ్రాంట్ 85 కోట్లు చెల్లించినట్టు ప్రగల్భాలు పలికిందన్నారు. సర్పంచుల బిల్లులు చెల్లిస్తే ముందస్తు అరెస్టులు ఎందుకు అని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శులు చేసిన చిన్న చిన్న పనులకు బిల్లు చెల్లించిందని, వాటిని సర్పంచులకు చెల్లించినట్టు ప్రచారం చేసుకున్నదని తెలిపారు. ప్రభుత్వం ఒక్క రూపాయి చెల్లించకపోగా అరెస్టులతో మాజీ సర్పంచులను మానసికంగా, ఆర్థికంగా కుంగదీసే ప్రయత్నం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన వారిలో హుజూరాబాద్ మండలానికి చెందిన మాజీ సర్పంచులు బింగి కరుణాకర్, చేరాల మనోహర్, లక్ష్మారెడ్డి, తిరుపతి, కిరణ్, ఇల్లందకుంట మాజీ సర్పంచులు తిప్పారపు మొగిలి, కంది దిలీప్ రెడ్డి, మూడెత్తుల వెంకటస్వామి తదితరులు ఉన్నారు. అలాగే చిగురుమామిడి మండలానికి చెందిన మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు జక్కుల రవి, సన్నిల్ల వెంకటేశం, గోలి బాపురెడ్డి, బెజ్జంకి లక్ష్మణ్, సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మీరెడ్డిని పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. గంగాధర మండలంలో అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచులు శ్రీమల్ల మేఘరాజు, ఎండీ నజీర్, వడ్లూరి ఆదిమల్లు, పొట్టల కనకయ్య తదితరులు ఉన్నారు. శంకరపట్నం మండలంలో ఎరడపల్లి, మొలంగూర్ గ్రామాల మాజీ సర్పంచులు కలకుంట్ల రంజిత్‌రావు, మోరె శ్రీనివాస్, తిమ్మాపూర్ మండలంలో మాజీ సర్పంచులు మేడి అంజయ్య, మామిడి సతీశ్, వడ్లూరి శంకర్‌తో పాటు చొప్పదండి, జమ్మికుంట మండలాల్లో పలువురు మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. వీణవంక మండలంలో మాజీ సర్పంచులు పోతుల నర్సయ్య, మోరె సారయ్య, మర్రి వరలక్ష్మి-స్వామి, సైదాపూర్ మండలంలో మాజీ సర్పంచులు రేగుల సుమలతా అశోక్, తాటిపల్లి యుగేంధర్ రెడ్డి, మ్యాకల శిరీషా ముకుందరెడ్డి అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. గన్నేరువరం మండలంలో మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు తీగల మోహన్ రెడ్డి, గంప మల్లేశ్వరీ వెంకన్న, మల్లయ్య, నగేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

## జీలుగ, జనుము విత్తనాల పంపిణీ

గన్నేరువరం, మే 27: మండలంలోని గన్నేరువరం, గుండ్లపల్లి, సాంబయ్యపల్లి, హన్మాజీపల్లి డీసీఎంఎస్ కేంద్రాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి కిరణ్మయి రైతులకు జీలుగ, జనుము విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 50 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

## కార్మిక సమాఖ్య మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా సౌమ్య

తెలంగాణచౌక్, మే 27: తెలంగాణ కార్మిక సమాఖ్య మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా నేరెళ్ల సౌమ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమెను ఎన్నుకున్నట్లు సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి అంబాల ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు సౌమ్యకు సభ్యుల సమక్షంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళా కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో జిల్లా, నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సెలవులో కరీంనగర్ డీఈవో?

కరీంనగర్, మే 27(నమస్తే తెలంగాణ) : కరీంనగర్ డీఈవో జనార్దన్ రావు సెలవులో వెళ్లినట్టు తెలిసింది. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు సమయంలో మహిళా ఉపాధ్యాయులపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారని, అసభ్య పదజాలాన్ని వాడారని అభ్యంతరం వ్యక్తం చేస్తూ మంగళవారం కొన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాల విద్యా సంచాలకులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై జిల్లాలోని కొందరు మహిళా ఉపాధ్యాయులు సైతం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ డీఈవోను సరెండర్ చేస్తున్నట్టు తెలిసింది. ఎలాగూ చర్యలు తీసుకుంటారని ఊహించిన ఆయన ముందస్తుగా సెలవులో వెళ్లినట్లు తెలిసింది.

## జమ్మికుంటలో స్వర్ణామృత ప్రాసన

జమ్మికుంట, మే 27: వికాస తరంగిణి జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 31 పుష్యమి నక్షత్రం రోజున 6-16 సంవత్సరాల పిల్లలకు స్వర్ణామృత ప్రాసన డోసు ఉచితంగా అందించనున్నట్లు వికాస తరంగిణి సభ్యులు హరికృష్ణమాచార్యులు, జితేందర్‌గుప్తా, రాజిరెడ్డి, వీరరాజు, ప్రభాకర్‌రావు, సురేశ్‌బాబు, విజయ్, శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణామృత ప్రాసన ద్వారా పిల్లల్లో రోగనిరోధక, జ్ఞాపక శక్తి పెరుగుతుందని, మాటలు సరిగ్గా రావడానికి, జీర్ణక్రియ మెరుగు పడేందుకు, శరీర ఎదుగుదల దోహదపడుతుందని పేర్కొన్నారు. డోసు అవసరమున్న తల్లిదండ్రులు 9989509999/ 7893426429 నంబరుకు ఫోన్ చేసి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.

## సీడ్ షాపుల్లో అధికారుల ఆకస్మిక తనిఖీలు

జమ్మికుంట, మే 27: మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ రామకృష్ణ స్థానిక ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్(విత్తన)దుకాణాల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా స్టాక్, రికార్డులు పరిశీలించారు. అనంతరం సీఐ, ఏవో మాట్లాడుతూ.. రైతులకు ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలని ఆదేశించారు. బ్లాక్‌లో విత్తనాలు అమ్మకూడదని చెప్పారు. స్టాక్ బోర్డుపై తెలియజేయాలని, రైతులకు మోసం చేసే చర్యలను క్షమించేది లేదని హెచ్చరించారు. ఇక్కడ ఏఈవోలు, సిబ్బంది, తదితరులున్నారు.

## ఆర్నకొండ రైతువేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

చొప్పదండి, మే 27: మండలంలోని ఆర్నకొండ రైతు వేదికలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు వానాకాలంలో వేసుకునే పంటలు, పంటల యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, ఆయిల్ పామ్ సాగు విధానం, డ్రిప్ ద్వారా నీరు ఆదా చేయడం, పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాస్ రావు, వ్యవసాయ పరిశోధన స్థానం, చింతకుంట శాస్త్రవేత్తలు ఉషారాణి, విజయ భాస్కర్, వ్యవసాయ అధికారి ప్రభావతి, వెటర్నరీ డాక్టర్ రామకృష్ణ, తెలంగాణ సీడ్స్ డీఎం విష్ణువర్ధన్, మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ, ఉద్యానవన అధికారి రోహిత్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి విద్యార్థిని మృతి

మానకొండూర్ రూరల్, మే 27: ఎంబీఏ విద్యార్థిని ప్రమాదవశాత్తు చేదబావిలో పడి మృతి చెందిన ఘటన కందులపల్లెలో చోటు చేసుకున్నది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మండలంలోని కెల్లేడు గ్రామ శివారులోని కందులపల్లె గ్రామానికి చెందిన కందుల స్వప్న- ముత్తయ్య దంపతుల కూతురు అశ్విత (20) ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నది. మంగళవారం ఉదయం అశ్విత తల్లిదండ్రులు ఉపాధిహామీ పనులకు వెళ్లగా, తమ్ముడు రాజు ఇంట్లోనే ఉన్నాడు. రాజు గేదెలకు నీళ్లు పెట్టి కాళ్లు కడుక్కుందామని, ఇంటి ముందు ఉన్న చేదబావి దగ్గరకు వచ్చాడు. అప్పటికే అశ్విత బావిలో పడినట్లు గుర్తించి, కేకలు వేశాడు. వెంటనే చుట్టు పక్కల వారు వచ్చి ఆమెను పైకి తీశారు. అప్పటికే అశ్విత బావిలో ఊపిరి ఆడక మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బావికి చుట్టూ గోడ లేకపోవడంతోనే నీళ్లు తోడే క్రమంలో ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. అశ్విత తల్లి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మానకొండూర్ సీఐ సంజీవ్ తెలిపారు.